క్లుప్తంగా

విమానాశ్రయంలో ప్రయాణికుల రద్దీ



విమానాశ్రయంలో ప్రయాణికులు

మధురపూడి: రాజమహేంద్రవరం విమానాశ్రయం మంగళవారం ప్రయాణికులతో కిటకిటలాడింది. ఇక్కడి నుంచి ఇండిగో విమానయాన సంస్థ సర్వీసులను నిర్వహిస్తోంది. వేసవి నేపథ్యంలో హైదరాబాద్, బెంగళూరు, చెన్నై తదితర ప్రాంతాల నుంచి ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన వారు తిరిగి ఇంటికొస్తున్నారు. సుదూర ప్రాంతాల్లో చదువుతున్న పదో తరగతి, ఇంటర్ విద్యార్థులు పరీక్షలు పూర్తవ్వడంతో సెలవులకు సొంతూర్లకు చేరుతున్నారు. ఇక్కడి నుంచి 22 విమాన సర్వీసులు రోజూ హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, విశాఖపట్నానికి రాకపోకలు సాగిస్తున్నాయి.

విద్యార్థులకు పోటీలు



బహుమతులు అందుకున్న విద్యార్థులు

రాజానగరం: ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని (కాపీరైట్) పురస్కరించుకుని గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ కాలేజీలో విద్యార్థులకు మంగళవారం చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలలో విజేతలకు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండీ ధనరాజ్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ షేక్ మీరా తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడి మృతి



వెలగల సత్య నారాయణరెడ్డి(ఫైల్)

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు వెలగల సత్యనారాయణరెడ్డి(80) మంగళవారం మృతి చెందారు. హిందీ ఉపాధ్యాయునిగా పనిచేసి పదవీ విరమణ చేసిన ఆయన గ్రామంలో మొక్కలు నాటడంతో పాటు ప్రజల్ని ఆధ్యాత్మిక దిశగా నడిపించేందుకు లలితా సహస్ర పారాయణ, భగవద్గీత పారాయణ వంటివి నేర్పించేవారు. ఆయన మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

చలివేంద్రం ప్రారంభం

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు వంతెన వద్ద స్థానిక జనసేన పార్టీ నాయకుల ఆధ్వర్యంలో చలివేంద్రం మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలోని జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

సారా కేసులో ఇద్దరి అరెస్ట్

రంగంపేట: సారా కేసులో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. మంగళవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని సుభద్రంపేట గ్రామానికి చెందిన మారిశెట్టి సూరిబాబు, మారిశెట్టి వీర్రాజులు సుభద్రంపేట గ్రామ శివారులో సారా అమ్మడానికి సిద్ధంగా ఉండగా, దాడిచేసి పట్టుకుని వారి నుంచి 20 లీటర్ల సారాతో పాటు రవాణాకు ఉపయోగిస్తున్న బైక్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇద్దరిపై కేసు నమోదుచేసి పెద్దాపురం ఏజేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపరిచామన్నారు. గతంలోనూ మారిశెట్టి సూరిబాబుపై నాలుగు కేసులు, మారిశెట్టి వీర్రాజుపై ఒక కేసు నమోదైనట్టు ఆయన చెప్పారు.

సారా తరలిస్తున్న వ్యక్తికి రిమాండ్

సీతానగరం: దేవీపట్నం మండలం రామన్నపాలేనికి చెందిన బొమ్మిన వీరబాబుకు కోర్టు రిమాండ్ విధించిందని ఎస్సై కె.శుభశేఖర్ మంగళవారం తెలిపారు. వీరబాబు తన మోటారు సైకిల్‌పై సారా తరలిస్తుండగా పురుషోత్తపట్నం శివారున అరెస్ట్ చేసి, 50 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. సింగవరానికి చెందిన మార్గాని సూరిబాబుకు విక్రయించడానికి ఈ సారా తీసుకువస్తున్నాడన్నారు.

రక్తహీనతపై సదస్సు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం పీహెచ్‌సీలో డాక్టర్ ఏసురాణి ఆధ్వర్యంలో రక్తహీనతపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఏసురాణి మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు సమన్వయంతో పనిచేయాలని, గర్భిణులు, బాలింతలు, పిల్లలకు రక్తహీనత కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం

కంబాలచెరువు: ప్రకాశం నగర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ ఫిబ్రవరి తొమ్మిదో తేదీన అనారోగ్యంతో మృతి చెందిన హెడ్‌కానిస్టేబుల్ కె.సత్య శ్రీనివాస్ కుటుంబానికి అడిషనల్ కార్పస్ ఫండ్ రూ.లక్ష ఆర్థిక సాయాన్ని మంగళవారం అందించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శ్రీనివాస్ భార్య భవానికి ఆ చెక్కును జిల్లా అడిషనల్ ఎస్పీ సీహెచ్ పాపారావు అందజేశారు. ప్రభుత్వం నుంచి అందాల్సిన ఇతర బెనిఫిట్లు త్వరితగతిన వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఈ పాఠశాలకు ఏమైంది..

- రాజానగరం హైస్కూలు దుస్థితి
- విద్యార్థిపై దాడి ఘటనతో కలకలం



రాజానగరంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల



తరగతి గదిలో ఫ్యాన్ల పరిస్థితి

రాజానగరం: నియోజకవర్గ కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి విద్యార్థిపై సహ విద్యార్థి కత్తితో దాడి చేసిన ఘటన కలకలం రేపింది. ప్రేమ వ్యవహారంలో ఈ వివాదం చోటుచేసుకోవడం, అది హత్యాయత్నానికి దారి తీయడం స్థానికంగా చర్చనీయాంశమైంది. 9వ తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభమైన తొలిరోజునే ఒక విద్యార్థి మరో విద్యార్థిపై ఇన్విజిలేటర్ ఎదుటనే చాకుతో దాడికి పాల్పడి తీవ్రంగా గాయపరచిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో ఆ పాఠశాల తీరుతెన్నులపై స్థానికులు చర్చించుకుంటున్నారు.

ఒకప్పుడు క్రమశిక్షణకు మారుపేరు

ఈ పాఠశాల ఒకప్పుడు క్రమశిక్షణకు మారుపేరుగా ఉండేది. కానీ నేడు విద్యార్థిపై హత్యాయత్నం ఘటనతో సర్వత్రా కలకలం రేగింది. ఈ ఘటనపై అందరూ విచారం వ్యక్తం చేస్తున్నారు. పట్టుమని 15 ఏళ్ల వయసు కూడా లేని విద్యార్థులు ఈ విధంగా వ్యవహరిస్తుంటే ఉపాధ్యాయులు ఏంచేస్తున్నారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. పాఠశాల పూర్వ విద్యార్థి అయిన రిటైర్డ్ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రసాద్ ఉద్యోగంలో ఉండగా మంజూరు చేసిన రూ. మూడు కోట్ల నిధులతో ఈ పాఠశాలను పదేళ్ల క్రితం పునర్నిర్మించారు. 22 తరగతి గదులతో జూనియర్ కళాశాల మాదిరిగా జీ ప్లస్ వన్‌లో పాఠశాల నిర్మాణం జరిగింది.

తగ్గుతున్న విద్యాప్రమాణాలు

అయితే అందుకు అనుగుణంగా బోధన, విద్యార్థుల నడవడిక లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు విద్యార్థులు అల్లరి చిల్లర పనులతో ఉపాధ్యాయులంటే భయం లేకుండా ఉంటున్నారు. అలాగే విద్యా ప్రమాణాలు కూడా తగ్గుతూ వస్తున్నాయని, నాలుగేళ్లుగా పదో తరగతి పరీక్షా ఫలితాలే వీటికి నిదర్శనమంటున్నారు. విద్యార్థిపై దాడి జరిగిన తరగతిని పరిశీలిస్తే చాలా అధ్వానంగా ఉంది. ఈ గదిలో నాలుగు సీలింగ్ ఫ్యాన్‌లుంటే, ఏ ఒక్క ఫ్యాన్ రెక్కలు కూడా సవ్యంగా లేవు. అన్నీ కిందకు వంచేసి ఉన్నాయి. అదేమంటే విద్యార్థులు ఈ ఫ్యాన్ రెక్కలను పట్టుకుని వేలాడేవారని, అందుకనే అవి వంగిపోయాయని కొందరు విద్యార్థులు తెలిపారు.

క్రమశిక్షణ తప్పింది

రాజానగరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఒకప్పుడు హెచ్ఎంగా పనిచేసిన ఆర్ఎస్ వెంకట్రావు అంటే విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు కూడా హడలెత్తిపోయేవారు. క్రమశిక్షణకు మారుపేరుగా ఆయననే ఇప్పటికీ చెప్పుకుంటారు. ఆ భయం, భక్తి నేడు పూర్తిగా కొరవడ్డాయి. విద్యార్థులకు క్రమశిక్షణ తప్పింది.

– కంచుపట్ల రామకృష్ణ, పూర్వ విద్యార్థి, మాజీ సర్పంచ్, రాజానగరం

భయభక్తులు లేవు

గతంలో మాదిరిగా విద్యార్థులకు గురువులంటే భయమే కాదు, భక్తిభావాలు కూడా ఉండటం లేదు. ఎవరైనా గట్టిగా మందలిస్తే తల్లిదండ్రులొచ్చి గొడవ పడుతున్నారు. ఈ నేపథ్యంలో చాలామంది ఉపాధ్యాయులు తరగతిలో బోధనతోనే తమ డ్యూటీ అయిపోయిందన్నట్టుగా వ్యవహరిస్తున్నారు.

– ఉల్లి బాబూరావు, పాఠశాల పూర్వపు అభివృద్ధి కమిటీ చైర్మన్, శ్రీరామనగర్, రాజానగరం

సుబ్రహ్మణ్యేశ్వరునికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

బిక్కవోలు: మంగళవారం వైశాఖ మాసం పంచమితో పాటు పరమశివుడు జన్మనక్షత్రమైన ఆరుద్ర నక్షత్రం కలిసి రావడంతో బిక్కవోలు సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిరవహించారు. అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామిని దర్శించుకున్నారు. మంగళవారం 182 అభిషేకాలు జరిగినట్లు ఆలయ అధికారి ప్రసాద్ తెలిపారు.

ఆరు ఫ్లైఓవర్లకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్



ఢిల్లీలో జరిగిన సమావేశంలో పాల్గొన్న ఎంపీ మార్గాని భరత్‌రామ్

- రెండు నెలల్లోనే శంకుస్థాపనలు
- శరవేగంగా మోరంపూడి బ్రిడ్జి పనులు
- ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా ప్రధాన కేంద్రమైన రాజమహేంద్రవరంలో అభివృద్ధి శరవేగంతో పరుగులు పెడుతోందని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. ఆయన మంగళవారం ఢిల్లీ నుంచి ఫోన్లో విలేకరులతో మాట్లాడారు. నగరాన్ని ఆనుకుని ఉన్న జాతీయ రహదారి పొడవునా ప్రధాన జంక్షన్ల వద్ద ఏడు ఫ్లైఓవర్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అంగీకారం తెలిపిందన్నారు. ఇప్పటికే మోరంపూడి జంక్షన్ వద్ద నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయన్నారు. అలాగే వేమగిరి, బొమ్మూరు, లాలాచెరువు, దివాన్ చెరువు, ఓఎన్జీసీ, గామన్ రోడ్డు జంక్షన్ల వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. వందల కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించే వీటికి రెండు నెలల్లో శంకుస్థాపనలు జరుగుతాయన్నారు. ఇది కాకుండా రైల్వే శాఖకు సంబంధించి నగరంలోని అన్నపూర్ణమ్మపేట క్రాస్ లెవెల్ (ఆర్‌సీఎల్) వద్ద మరో ఫ్లైఓవర్ బ్రిడ్జి రానుందన్నారు. దీనికి సంబంధించి రైల్వేశాఖ, ఇంజినీరింగ్ అధికారులు సర్వే పూర్తి చేశారని వివరించారు. ఇప్పటికే నగరంలో సెంటర్ డివైడర్లు పూర్తయ్యాయని, ప్రధాన జంక్షన్లను సర్వాంగ సుందరంగా అభివృద్ధి చేశామని చెప్పారు. రాజానగరం నుంచి కడియపులంక వరకూ సర్వీసు రోడ్డు నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరైనట్టు తెలిపారు. ఈ నిర్మాణాలన్నీ పూర్తయితే రాజమహేంద్రవరం నగర రూపురేఖలు మారడమే కాదు, నగరవాసులకు ప్రమాదాల నుంచి పూర్తి రక్షణ ఏర్పడుతుందన్నారు. ఏ రాష్ట్రంలోని పార్లమెంటు నియోజకవర్గానికి ఇన్ని ఫ్లైఓవర్ బ్రిడ్జిలు మంజూరైన దాఖలాలు లేవన్నారు. కాగా.. ఆయన ఢిల్లీలో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు గడువు పెంపు

గోకవరం: ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 28 వరకు గడువు పెంచినట్టు భూపతిపాలెం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బేతపూడి రవి మంగళవారం తెలిపారు. భూపతిపాలెం బాలుర గురుకుల పాఠశాలలో 2023–24 విద్యాసంవత్సరంలో ఐదో తరగతి ప్రవేశాలకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుదారులకు వచ్చే నెల 20న జిల్లా ప్రధాన కేంద్రంలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 98665 59622 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

సారా తయారీదారునిపై పీడీ యాక్టు

రంగంపేట: సారా తయారుచేస్తున్న వ్యక్తిపై పీడీ యాక్టు అమలు పరిచినట్టు సెబ్ సీఐ జి.వెంకటలక్ష్మి తెలిపారు. మంగళవారం ఆమె చెప్పిన వివరాల ప్రకారం జి.దొంతమూరు గ్రామానికి చెందిన సారా తయారీదారుడు బుక్కా చక్రవర్తిపై జిల్లా కలెక్టర్ మరియు మేజిస్ట్రేట్ ఉత్తర్వుల ప్రకారం పీడీ యాక్టు అమలు చేసి రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి తరలించినట్టు తెలిపారు. ఎవరైనా సారా తయారీ, రవాణా, అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురం గ్రామంలో శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లిడి గంగారెడ్డి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామిని దర్శించుకోవాలని ఆయన కోరారు.

ఉపాధి పనులపై సమావేశం

సీతానగరం: ఉపాధి హామీ పథకం పనులకు కూలీలను పెంచాలని డ్వామా పీడీ జీఎస్ రామ్‌గోపాల్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో జరిగే ఉపాధి హామీ పథకం పనులను 5 వేల మంది కూలీలతో చేయించాలన్నారు. అన్ని గ్రామాల్లో ఉద్యానవన పంటలకు సంబంధించి అంచనాలు రూపొందించాలన్నారు. మునగ ప్లాంటేషన్ వేయించాలని, అమృత్ సరోవర్‌లో చెరువుల అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేయాలన్నారు. సమావేశంలో ఏపీవో కె.నాగేశ్వేణి, జూనియర్ ఇంజినీర్ అంజని కుమార్, టీఏ చక్రవర్తి, ఫీల్డ్ అసిస్టెంట్లు రాంబాబు, నగేష్ కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సచివాలయాలతో ప్రజల ముంగిటకు పథకాలు



నిడిగట్లలో ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- నిడిగట్లలో గడప గడపకూ మన ప్రభుత్వం

మధురపూడి: ఇచ్చిన హామీలు, వాగ్దానాలను వందశాతం నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండ మండలం నిడిగట్ల గ్రామంలో మంగళవారం నాలుగో రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాదయాత్ర ద్వారా ప్రజల కష్టాలను గుర్తించిన జగనన్న.. వాటి పరిష్కార సాధనలో భాగంగానే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. నిడిగట్ల గ్రామంలో రూ. 3 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. సంక్షేమ పథకాలు అందరికీ అందించడంతో పాటు, సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించడం కోసం సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చామన్నారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమం రాత్రి వరకూ జరిగింది. దీనిలో భాగంగా ఎమ్మెల్యే రాజా వంద గడపలు తిరిగారు. ప్రతి గడపలో అక్కచెల్లెమ్మలను ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు అడపా కనకరాజు, గణేశుల పోసి, నాయకులు యడ్ల సత్యనారాయణ, పళ్ల కృష్ణ, కొల్లం రాజారమాదేవి, గొంతు లక్ష్మణ్, వల్లభశెట్టి బాబ్జీ, వల్లభశెట్టి రాంబాబు, దాసి దొరబాబు పాల్గొన్నారు.

ఫరిజల్లిపేటలో..

రాజానగరం మండలం ఫరిజల్లిపేటలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆధ్వర్యంలో గడపగడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వాసంశెట్టి పెద్ద వెంకన్న, మాజీ సర్పంచ్ ఉండవల్లి రాజబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, మాజీ కన్వీనర్ మందారపు వీర్రాజు, నెడ్‌క్యాప్ డైరెక్టర్ గాంధీ నానిబాబు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత అజ్జరపు యువసేన



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న ఎంపీ భరత్‌రామ్

ప్రకాశం నగర్: యువత పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని, గెలుపు, ఓటములను సమానంగానే స్వీకరించాలని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంత్యుత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 11 నుంచి 23 వరకూ బత్తిన సుబ్బారావు సేవాసమితి అధ్యక్షుడు బర్రే కొండబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నీ విజేతలకు సోమవారం బహుమతులు అందజేశారు. రెండువారాల పాటు నిర్వహించిన ఈ టోర్నీలో మొత్తం 27 జట్లు తలపడ్డాయి. అజ్జరపు యువసేన విజేతగా, సుబ్బారావు పేట బాలు స్ట్రైకర్ రన్నర్‌గా నిలిచాయి. విజేతలకు ఎంపీ మార్గాని భరత్ రామ్ చేతుల మీదుగా కప్ అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, సిటీ యూత్ అధ్యక్షుడు పితాని రామకృష్ణ, టీకే విశ్వేశ్వరరెడ్డి, సాగర్, గుర్రం గౌతమ్ పాల్గొన్నారు.

బైక్ విజేత ప్రవీణ్ రాథోడ్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): మోరంపూడి జంక్షన్‌లోని రాజమండ్రి స్టీల్స్‌లో జేఎస్‌డబ్ల్యూ నియో స్టీల్ కొనుగోలు చేసిన ఆర్యాపురం నివాసి, రాజేంద్ర ఇన్ఫ్రా అధినేత ప్రవీణ్ రాథోడ్ ఐపీఎల్ స్కీమ్‌లో బైక్‌ను బహుమతిగా గెలుచుకున్నాడు. హోటల్ షెల్టాన్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయనకు జేఎస్‌డబ్ల్యూ స్టీల్స్ కంపెనీ జోనల్ సేల్స్ మేనేజర్ ఎర్షాద్ అలీఖాన్, వీవీ స్టీల్స్ అధినేత కటకం స్వామి బైక్‌ను అందజేశారు. కార్యక్రమంలో తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని సబ్ డీలర్లు, ఖాతాదారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



రామదుర్గ కాలనీలో పథకాలను వివరిస్తున్న గృహసారథులు

సీతానగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని గృహసారథి సూరపురెడ్డి వెంకటేశ్వరరావు అన్నారు. చినకొండేపూడి పంచాయతీ పరిధిలోని రామదుర్గ కాలనీలో గృహసారథులు వెంకటేశ్వరరావు, అల్లు దేవుడమ్మ ఆధ్వర్యంలో మంగళవారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. పథకాల ద్వారా ఆ కుటుంబం ఎంత లబ్ధి పొందిందో వివరించారు. 2024 ఎన్నికల్లో జగన్‌ను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. బుక్‌లెట్‌లో ఉన్న ప్రశ్నలకు జవాబులు రాబట్టి, మిస్డ్ కాల్ చేశారు. అనంతరం ఇళ్లకు, సెల్‌ఫోన్లకు మా నమ్మకం నువ్వే జగనన్న స్టిక్కర్లు అతికించారు. కార్యక్రమంలో వలంటీర్ అల్లు హారిక, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటర్న్‌షిప్‌కు ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ కృష్ణ

కంబాలచెరువు: ఆర్ట్స్ కళాశాల రసాయనశాస్త్రం పీజీ విద్యార్థులు ప్రఖ్యాత పరిశోధనా సంస్థల్లో ఇంటర్న్‌షిప్‌కు ఎంపికయ్యారు. ఈ మేరకు ఆ వివరాలను ప్రిన్సిపాల్ సీహెచ్ కృష్ణ మంగళవారం తెలిపారు. రసాయనశాస్త్ర ప్రయోగశాల సమన్వయకర్త డాక్టర్ బి.మల్లికార్జున మాట్లాడుతూ పీజీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు సుప్రజ అరుణాచల్ ప్రదేశ్‌లోని రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ, ప్రథమ సంవత్సరం విద్యార్థి బి.జగదీష్ హైదరాబాద్ ఐఐటీలోనూ రెండు నెలల పాటు ప్రఖ్యాత శాస్త్రవేత్తల పర్యవేక్షణలో జరిగే పరిశోధనల్లో పాల్గొంటారన్నారు. వీరికి రెండు నెలల పాటు ఉచిత వసతి, ఫెలోషిప్ లభిస్తాయన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో రసాయనశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ డి.సునీత, డాక్టర్ టి.నరసింహమూర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రపంచ మలేరియా దినోత్సవ ర్యాలీ



రంగంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది



సీతానగరంలో మలేరియా అవగాహన ర్యాలీ

రంగంపేట: ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది గ్రామంలో ర్యాలీ చేపట్టారు. పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఎ.అనూష ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జ్వరం, తలనొప్పి, వాంతులు, చలి, అలసట, తల తిరగడం, కడుపునొప్పి వంటి లక్షణాలు ఉంటే మలేరియా గుర్తించి వెంటనే పీహెచ్‌సీకి రావాలని సూచించారు. నిల్వ ఉన్న నీటిలో మలేరియా దోమలు పెరుగుతాయి కనుక ప్రతిఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మర్రిపూడి గ్రామంలో సర్పంచ్ వేము మాధవి ఆధ్వర్యంలో మలేరియా అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ ఎస్‌వీబీ శంకర్, హెచ్‌వీ జ్యోతి, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

మలేరియా నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

గోకవరం: మలేరియా నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర శ్రీవల్లి, కర్రి సూరారెడ్డి కోరారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని గోకవరంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. తొలుత స్థానిక సచివాలయం వద్ద ప్రజలకు మలేరియా వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ చేసి స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు దోమకాటు వలన కలిగే దుష్ప్రభావాలను వివరించారు. ఎంపీహెచ్ఈఓ వైఎస్ రాయుడు, పాఠశాల హెచ్ఎం చిమ్మరాజుదొర, కార్యదర్శి టంకాల శ్రీనివాస్‌రావు, హెచ్ఈ శైలజ, వైఎస్సార్ సీపీ నాయకులు తోలేటి రాంప్రసాద్, బి.వీరచంద్రం తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం

సీతానగరం: గ్రామాల్లో పరిసరాల శుభ్రత అతి ముఖ్యమని స్థానిక ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం డాక్టర్ ఏసురాణి అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మంగళవారం ఆమె ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దోమల ద్వారా మలేరియా తదితర వ్యాధులు వస్తాయన్నారు. సీహెచ్‌వో పి.రాధాకృష్ణ మాట్లాడుతూ ఇళ్ల వద్ద నిల్వ ఉన్న మురుకునీటిలో దోమలు ఉత్పన్నమవుతాయని తెలిపారు. వీటి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సూర్యకుమారి, కేవల్ రాయ్, దైవకృప, ఏఎన్‌ఎంలు సలీమా బీ, మునీషా బేగం, సంధ్య, పీఎస్ కుమారి, ఆశావర్కర్లు జ్యోతి, వెంకటలక్ష్మి, కుమారి పాల్గొన్నారు.

ప్రజలకు నేరుగా సేవలందించేవి పంచాయతీలే



జేగురుపాడు సర్పంచ్ స్టాలిన్‌ను సత్కరిస్తున్న మండల పరిషత్ సభ్యులు, సర్పంచ్‌లు

కడియం: క్షేత్రస్థాయిలో ప్రజలకు నేరుగా సేవలందించేవి పంచాయతీ పాలకవర్గాలేనని ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ అన్నారు. మండల పరిషత్ సమావేశాన్ని పురస్కరించుకుని మంగళవారం సమావేశ మందిరంలో పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉమెన్ ఫ్రెండ్లీ విభాగంలో రాష్ట్ర ఉత్తమ పంచాయతీగా నిలిచిన జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్రస్టాలిన్‌తో పాటు, మండలంలోని సర్పంచ్‌లు, ఆయా గ్రామ పంచాయతీ సిబ్బందిని శాలువా, మెమెంటో, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. స్టాలిన్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు అభివృద్ధి చెందాలంటే స్థానికంగా ఆదాయ వనరులు పెంపొందించుకోవాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో గ్రామ పంచాయతీల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందన్నారు. గ్రామస్థాయిలో సచివాలయ వ్యవస్థ, రైతు భరోసా కేంద్రాలు, వెల్నెస్ సెంటర్‌లను నిర్మిస్తోందన్నారు. కార్యక్రమంలో భాగంగా సర్పంచ్‌లు అన్నందేవుల చంటి, మోసిగంటి సత్యవతి, చెక్కపల్లి మురళీకృష్ణ, మార్గాని అమ్మాజీ, కొత్తపల్లి సత్యవతి, అయినవిల్లి రుక్మిణీ తదితరులను సత్కరించారు. ఎంపీడీవో కె.రత్నకుమారి, తహసీల్దార్ ఎం.సుజాత, శాప్ డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్ర, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ దొంతంశెట్టి చిన వీరభద్రయ్య, వైస్ ఎంపీపీలు పంతం గణపతి, కలిదిండి విశాలాక్షి, నాయకులు బత్తుల రాము, కె.వెంకటేశ్వరరావు, అయినవిల్లి వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు. అంతకు ముందు శాఖల వారీగా మండల పరిధిలోని ప్రగతిని సమావేశంలో వివరించారు.